క్లుప్తంగా

మేరుగ నాగార్జునకు శుభాకాంక్షలు

వేమూరు: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులుగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున నియమితులు కావడంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చందోలు డేవిడ్ విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు. వేమూరు నియోజకవర్గంలో 2009 నుంచి పార్టీ కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడు మేరుగ నాగార్జున అని ఆయన కొనియాడారు. అలాంటి వ్యక్తికి జిల్లా అధ్యక్ష పదవి దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు.

పెనుమాల సేవలు ఎనలేనివి



రేపల్లె రూరల్: ప్రజా ఉద్యమాలలో పెనుమాల సుబ్బారావు సేవలు అజరామరమని జైభీమ్‌రావు భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్‌రాంజీ చెప్పారు. దళిత నాయకులు పెనుమాల సుబ్బారావు వర్ధంతి సందర్భంగా 13వ వార్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రేపల్లె ప్రాంతంలో ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసిన సుబ్బారావు సేవలు ఎనలేనివని, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వార్డులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతారులంక శివ వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ కర్రా బాబూరావు, పెనుమాల క్రాంతి, దాసరి ప్రకాష్ పాల్గొన్నారు.

చిరస్మరణీయురాలు వెలగపూడి సరస్వతమ్మ



బాపట్ల: బాపట్ల ప్రాంతంలో స్త్రీ విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన వారిలో అగ్రగణ్యులు వెలగపూడి సరస్వతమ్మ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు తెలిపారు. సరస్వతమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఎస్ఎంజీ జూనియర్ కళాశాల వద్దనున్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రచయిత్రి చిల్లర భవానీ దేవి, ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీదేవి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

వేమూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి తమ్మాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వెల్లడించారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ చదివిన 35ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

వరదల్లో ప్రాణనష్టాన్ని నివారించగలిగాం



కొల్లూరు : వరదల్లో అధికారులు సమర్థంగా పనిచేశారని, ప్రాణనష్టాన్ని నివారించగలిగారని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గురువారం మండలంలోని అనంతవరంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం జమకాని రైతులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

కొల్లూరు : వరదల వల్ల పంట నష్ట పరిహారం బ్యాంక్ ఖాతాల్లో జమకాని రైతులు తమ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకోవాల్సిన అవసరం ఉందని కొల్లూరు మండల వ్యవసాయ శాఖాధికారి ఆర్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానమైతేనే పరిహారం జమవుతుందని వివరించారు.

అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లపై చర్యలు తప్పవు

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలో అనధికారికంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడం నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో ప్రకటించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా వాటిని ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని సూచించారు.

అవస్థల పర్వం

- చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- దట్టంగా ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు
- రోజుల తరబడి నిల్వ ఉంటున్న నీరుతో దోమల బెడద
- విష సర్పాల సంచారంతో ప్రజల బెంబేలు
- అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం



రామకోటిపేట శివాలయం రోడ్డులో నివాస గృహాల మధ్య ఖాళీ స్థలాల్లో పేరుకున్న మురుగునీరు

రేపల్లె రూరల్: పట్టణంలోని ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు, ముళ్ళ చెట్లు దట్టంగా పెరిగి విష సర్పాలు సంచరిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా ఖాళీ స్థలాల్లోకి చేరిన నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలకు ఆవాస ప్రాంతాలుగా మారుతున్నాయి. దీంతోపాటు సమీప గృహాలలో వాడిన మురుగునీరు ఖాళీ స్థలాలలోకి చేరడంతో ఆ ప్రాంతాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో పారిశుద్ధ్యం క్షీణించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. పట్టణంలోని 28 వార్డులలో 60వేలకుపైగా జనాభా, 25 వేల గృహాలు ఉన్నాయి. ప్రతి వార్డులో నివాస గృహాల మధ్య ఏళ్ళ తరబడి ఉన్న ఖాళీ స్థలాలలో సమస్యతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో సమస్య మరింత జఠిలం కావడంతో పలుమార్లు అధికారులకు సమస్యను పరిష్కరించాలని వినతులు సమర్పించటం సర్వసాధారణమవుతోంది. ముఖ్యంగా 21, 22, 23, 24, 25,26 వార్డులలో చిట్టడవులుగా ఉన్న ఖాళీ స్థలాల సమస్య ఎక్కువగా ఉంది. వెంటనే ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేసే చర్యలను అధికారులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యజమానులకు నోటీసులు జారీ చేశాం



పట్టణంలోని వివిధ వార్డులలో నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలలో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను గుర్తించాం. సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే 76 మంది స్థలాల యజమానులకు నోటీసులు అందజేశాం. పలువురు స్వచ్ఛందంగా వారి స్థలాలలోని పిచ్చిమొక్కలను తొలగించుకుని మెరకలు తోలించుకున్నారు. మిగిలిన స్థలాలలో ఉన్న పిచ్చిమొక్కలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జేసీబీల ద్వారా తొలగించి వాటికి అయ్యే ఖర్చును ఆయా స్థలాల యజమానుల ఆస్తి పన్నులపై విధిస్తాం.

కె.సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె



రామకోటిపేట శివాలయం రోడ్డులో నివాస గృహాల మధ్య మురుగునీరు



25వ వార్డులో నివాస గృహాల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు



23వ వార్డులో నివాస గృహాల మధ్య ఖాళీస్థలంలో దట్టంగా పెరిగిన పిచ్చిచెట్లు

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

బాపట్ల/రేపల్లె రూరల్/భట్టిప్రోలు : స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బాపట్ల నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ అండర్ 14, 17 బాలబాలికల ఎంపిక పోటీలు గురువారం జరిగాయి. 100 మీటర్లు, 200, 400, 800, 1500, 3000 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. వీటితోపాటు హైజంప్, లాంగ్‌జంప్, త్రోబాల్ పోటీలలో సత్తాచాటిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఈ పోటీలను నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కత్తి శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ కరీముల్లా, సోమరాజు, చందూ, తిరుపతిరావు, రవి తదితరులు పర్యవేక్షించారు.

■ రేపల్లె మోంట్‌ఫోర్ట్ స్కూల్ క్రీడామైదానంలో గురువారం నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్‌లో భాగంగా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీలకు రేపల్లె పట్టణ, మండలంతో పాటు నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. అండర్–14, 17 విభాగాలలో 500 మీటర్ల రన్నింగ్, త్రోబాల్, షార్ట్ పుట్, హైజంప్, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించి నియోజకవర్గ స్థాయి జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. వాలీబాల్, కబడీ తదితర పోటీలు త్వరలో నిర్వహిస్తామని మండల స్పోర్ట్స్ కన్వీనర్ రమేష్‌బాబు తెలిపారు. పోటీలను మండల విద్యాశాఖ అధికారి కేశనశెట్టి సురేష్, మాంట్‌ఫోర్ట్ స్కూలు ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు.

■ చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలలో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీ హైస్కూల్, సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్ బాలబాలికలు సత్తాచాటారు. పెసర్లంక హైస్కూల్ నుంచి షాట్‌పుట్, డిస్క్ త్రోలో ఎస్.సంతోష్ ప్రథమ, 100, 200, 400 మీటర్ల విభాగాలలో కె.నిహారిక ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే సూరేపల్లి హైస్కూల్ నుంచి షాట్‌పుట్, డిస్క్‌త్రో విభాగాలలో వి.చైతన్య ప్రథమ స్థానం సాధించారు.



బాపట్ల నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న మండల విద్యాశాఖ అధికారి కేసనశెట్టి సురేష్

ఏవీవీ స్కూలుకు స్టీలు బెంచీలు



బాపట్ల: స్థానిక ఏవీవీ హైస్కూలుకు పూర్వవిద్యార్థుల సహకారంతో స్టీలు బెంచీలు సమకూర్చడం సంతోషంగా ఉందని కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ బెంచీలతో పాటు పాఠశాలలో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను కమిషనర్ వి.నిర్మల్ కుమార్ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.సత్యవతి, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కె.గంగాధరరావు, కమిటీ సభ్యులు ఎన్.వి.దీక్షితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజన ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక



వెల్లటూరు(భట్టిప్రోలు): వీరమాత చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) ధైర్య సాహసాలు అనిర్వచనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో రజక సంఘ ఆధ్వర్యంలో రామాలయ ఆవరణలో ఐలమ్మ జయంత్యుత్సవం సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పోతార్లంక రాజేష్, చందోలు రవి కుమార్, ఐనంపూడి నాగేశ్వరరావు, సత్యన్నారాయణ, మున్నంగి శివమణి, పి.గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 56 మంది ఎంపిక

రేపల్లె రూరల్: పట్టణంలోని ఆర్‌సీ ఐటీఐ కళాశాలలో గురువారం వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. బ్లూస్టార్, జియో ఫైబర్ నెట్, క్లైమేట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఆసియన్ ఆటో స్పేర్ ప్రైవేట్ లిమిటెడ్, మారుతీ సుజికి తదితర కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 100 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 54 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అభ్యర్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బిషప్ ఇమ్మానుయేలురెబ్బా అభినందించారు.

వైద్యేతర విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



నిజాంపట్నం: వైద్యేతర విధుల నుంచి తమకు మినహాయింపునివ్వాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌ఓలు) గురువారం ఎంపీడీఓ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. సీహెచ్‌వోల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పులి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పెన్షన్ పంపిణీ వంటి వైద్యేతర విధుల వల్ల ఆస్పత్రుల్లో రోగులకు వైద్యం అందని పరిస్థితి నెలకొంటుందని వివరించారు. కార్యక్రమంలో నిజాంపట్నం మండల సీహెచ్‌వో నాయకులు దీపక్, సింధు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో కష్టాలు



జలదిగ్బంధంలో భట్టిప్రోలు కొత్త విఠలేశ్వరనగర్ కాలనీ

భట్టిప్రోలు: అల్పపీడన ప్రభావం వల్ల రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం కూడా వేమూరు నియోజకవర్గంలో వాన పడింది. అమృతలూరులో అత్యధికంగా 44.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భట్టిప్రోలులో 22.4, చుండూరులో 12.4, వేమూరులో 29.4, కొల్లూరులో 31.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. భట్టిప్రోలు కొత్త విఠలేశ్వరనగర్ కాలనీ జలదిగ్బంధంలో ఉంది. భట్టిప్రోలు గరువు దిగువన ఉన్న బాడవ పొలాలు నీట మునిగాయి.



భట్టిప్రోలు గరువు దిగువన బాడవలో చెరువును తలపిస్తున్న వరి చేలు

ఇసుక అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు

ఆర్డీవో హెలా షారోన్



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: రేపల్లె డివిజన్ పరిధిలో కృష్ణానది పరీవాహక ప్రాంతాలలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులూ లేవని, అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో హెలా షారోన్ హెచ్చరించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం రీచ్‌లోనూ ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వం కొత్తగా ఇసుక పాలసీని అక్టోబర్ 15 తరువాత ప్రకటించనున్నదని చెప్పారు. ఇసుక పాలసీ వచ్చిన తరువాత అనుమతులు ఉన్న రీచ్‌ల నుంచి కావాల్సిన ఇసుక సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. కొల్లూరు నుంచి రేపల్లె మండలం వరకు రాత్రి సమయాలలో అక్రమంగా కృష్ణానది నుంచి ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలపై అధికారులు పూర్తి నిఘా ఉంచి ఇసుక అక్రమాలను అడ్డుకోవాలని సూచించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓలేరు వద్ద టైరుబండ్లదారుల ఆందోళన

- మూడుగంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- ఎస్ఐ జోక్యంతో సమస్య పరిష్కారం



భట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద టైరుబండ్లను అడ్డుగా పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఓలేరు(భట్టిప్రోలు): ఇసుక రవాణాలో అధికారుల తీరును నిరసిస్తూ టైరుబండ్ల యజమానులు గురువారం పెనుమూడి–వెల్లటూరు రహదారి మార్గంలో ఆందోళన చేశారు. బండ్లను రోడ్డుకు అడ్డుగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇరు వైపులా మూడు గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని టైరుబండ్ల దారులకు నచ్చజెప్పే యత్నం చేశారు. భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య ఫోన్‌లో ఆందోళనకారులతో మాట్లాడారు. టైరుబండ్లతో రేవులో నుంచి ఈ రోజు మాత్రమే ఇసుక తీసుకు వెళ్లాలని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ విషయమై ఎస్ఐని 'సాక్షి' వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశానుసారం గురువారం ఒక్క రోజు మాత్రమే టైరుబండ్లతో ఇసుకను తీసుకువెళ్లమని చెప్పామని పేర్కొన్నారు.

పల్లెపాలెంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



భట్టిప్రోలు:ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం (ఏపీఎస్ఎస్‌టీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, స్టేషనరీ, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నీలం దేవరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని 12 లంక గ్రామాలలో 300 మంది విద్యార్థులకు రూ.లక్ష వ్యయంతో సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శివరామకృష్ణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



ముంపు బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సత్తెనపల్లికి చెందిన రాఘవేంద్ర బాల కుటీర్ విద్యాసంస్థల ప్రతినిధులు

కొల్లూరు/భట్టిప్రోలు : పోతార్లంక శివారు రావిలంక, తోకలవారిపాలెం శివారు కృష్ణనగర్ గ్రామాలలోని వరద బాధిత కుటుంబాలకు సత్తెనపల్లికి చెందిన రాఘవేంద్ర బాల కుటీర్ విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో రూ.1.20 లక్షల విలువైన నిత్యావసర సరకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోకలవారిపాలెం సర్పంచి టి. కృష్ణమోహన్, విద్యా సంస్థల డైరెక్టర్ మల్లేశ్వరరావు, కరస్పాండెంట్ వెలుగూరి సుబ్బారాయుడు, ప్రిన్సిపల్ గీతాంజలి, కొల్లూరు వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రామరాజు, కొల్లూరు జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ గుత్తా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

■ వరదల వల్ల నష్టపోయిన ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆదుకునేందుకు కర్నూల్ జిల్లా డోన్‌కు చెందిన సుధ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు, యాజమాన్యం, ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా)బాపట్ల జిల్లా కమిటీ సంయుక్తంగా ముందుకొచ్చింది. గురువారం భట్టిప్రోలు మండలం పెదలంక స్వాతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బోధిస్తున్న 26 మంది ఉపాధ్యాయులకు రూ.4 వేలు వంతున రూ.1.04 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో సుధ గ్రూప్ ఆఫ్ స్కూల్ కరస్పాండెంట్ సుధాకర్, అపుస్మా బాపట్ల జిల్లా అధ్యక్షులు ఎంవీ రావు, ఉపాధ్యక్షులు అంజిరెడ్డి, కార్యదర్శి ఎస్.రవిశంకర్ పాల్గొన్నారు.



పెదలంకలో సాయం అందుకున్న ప్రైవేటు టీచర్లు

ఒక్క అడుగు స్వచ్ఛత వైపు..

బాపట్ల: ఒక్క అడుగు స్వచ్ఛత వైపు వేద్దామని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాల డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ పేర్కొన్నారు. క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన ప్రదర్శన గురువారం చేపట్టారు. సర్దార్‌బేగ్ మాట్లాడుతూ స్వచ్ఛతాహీ ఉత్సవాలు పదిరోజులుగా కళాశాలలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్లాస్టిక్ నియంత్రణే ధ్యేయంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ విమల బీర, డాక్టర్ బ్లెస్సి సాగర్, డాక్టర్ ఈ గౌతమి, డాక్టర్ ఫణీంద్ర కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన చేస్తున్న ఎన్టీఆర్ ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాల విద్యార్థులు

మెప్మా సీఎంఎంలు బదిలీ

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని మెప్మా సిటీ మిషన్ మేనేజర్లు మాధవరావు, అరుణకుమారిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మాధవరావును గుంటూరుకు, అరుణకుమారిని రేపల్లె మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. రేపల్లెలో పనిచేస్తున్న విజయకుమారిని తెనాలికి పంపారు. వీరు కొద్ది రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

కవి వాసుకు జాషువా సాహితీ పురస్కారం



తెనాలి: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషు వా 129వ జయంతి వారోత్సవాల్లో భాగంగా దళిత రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని కార్డ్స్ సంస్థకు చెందిన ఆర్నాల్డ్ పాలస్ ఆడిటోరియంలో సాహితీ సభ ను నిర్వహించారు. నిర్వాహక సంఘం అధ్యక్షురాలు, వెడ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం.స్వర్ణలతాదేవి అధ్యక్షత వహించారు. ఇదే సభలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఈ తరానికి చెందిన అయిదుగురు దళిత కవులను గుర్తించి జాషువా సాహితీ పురస్కారాన్ని బహూకరించారు. ఈ పురస్కారాన్ని అందుకున్నవారిలో తెనాలికి చెందిన పరిశోధకుడు, కవి, సామాజిక ఆలోచనాపరుడు డాక్టర్ పిల్లి వాసు ఉన్నా రు. దళిత సార్వత్రిక విశ్వవిద్యా లయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, రేడియో రంజన్ డైరెక్టర్ ఎం.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.